సాక్షి
అనకాపల్లి
7
ఆదివారం । 10 । ఆగస్టు । 2025

అడ్డంకులు.. నిర్బంధం.. అవమానం

- సీఎం చంద్రబాబు పాడేరు పర్యటనలో అడుగడుగునా ఆంక్షలు
- గిరిజనుల సమస్యలు చెప్పేందుకు ప్రయత్నించిన పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు అడ్డగింత



పోలీసులు అడ్డగించడంతో రోడ్డుపైనే నిలిచిపోయిన పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

8లో

నిర్లక్ష్య తాండవం

- ప్రధాన గేట్లకు మరమ్మతులు చేసినా ఆగని లీకేజీ
- నామినేషన్ పద్ధతిలో కూటమి నేతలకు తాండవ అభివృద్ధి పనులు
- నీరు విడుదల చేసినా శివారుకు చేరడం కష్టమే


- తాండవ–ఏలేరు అనుసంధానానికి రూ.470.05 కోట్లు మంజూరు చేసిన గత సర్కారు
- వైఎస్సార్‌సీపీకి మంచి పేరు వస్తుందన్న అక్కసుతో నిలిపేసిన కూటమి ప్రభుత్వం
- రైతుల నుంచి వ్యతిరేకత రాకుండా స్పీకర్ అయ్యన్న ఎత్తుగడ
- పోలవరం తాండవ ఎత్తిపోతల పథకం తెస్తానంటూ హామీ
- ఇరిగేషన్‌శాఖలో ఆ పథకంపై ప్రతిపాదన ఊసేలేదు

కోట్లు ఖర్చు పెట్టినా తొలగని పూడిక



నాతవరం గ్రామంలో తాండవ కాలువ దుస్థితి

నాతవరం: తాండవ రిజర్వాయర్ కాలువల్లో కోట్లు ఖర్చు పెట్టినా ఎక్కడి పూడిక అక్కడే ఉంది. తాము అధికారంలోకి వచ్చాక తాండవ రిజర్వాయర్ అభివృద్ధి పనుల కోసం రూ.6 కోట్ల నిధులు తీసుకువచ్చామని ఈనెల 1వ తేదీన గునుపూడిలో పింఛన్ల పంపిణీకి వచ్చిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. కానీ ఆమేరకు పనులు జరిగిన దాఖలా లేదని రైతులు వాపోతున్నారు. మొదట విడతలో రూ.2 కోట్ల 40 లక్షలతో తాండవ అభివృద్ధికి పనులు చేపడుతున్నట్లుగా ప్రాజెక్టు డీఈ అనురాధ గతంలో తెలిపారు. తాండవ ఎడమ కాలువలో ఎక్కడ చూసినా పూడికతో నిండి ఉంది. నాతవరం గ్రామంలో ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకొని ఉన్న ఎడమ కాలువను చూస్తే హడలెత్తిపోతారు. పిచ్చి మొక్కలు పెరిగిపోయి కాలువ గుర్తుపట్టలేని విధంగా ఉంది. నర్సీపట్నం మండలం మెట్టపాలెం, నాతవరం మండలం ములగపూడి మధ్య తాండవ కాలువ బయటకు కనిపించకుండా తుప్పలతో పెరిగిపోయింది. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఎడమ కాలువలో నామమాత్రంగా పూడిక తీత పనులు జరిగినట్లుగా కన్పిస్తుంది. మొదట విడతలో మంజూరైన నిధులతో కూటమి నేతలకు నామినేషన్ పద్ధతిలో పనులు అప్పగించారు. అధికారులు, కూటమి నేతలు కుమ్మక్కై నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పనులు చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. తాండవ నీటిపై ఆధారపడి నర్సీపట్నం, పాయకరావుపేట, తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల పరిధిలో 52 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. పూడిక వల్ల శివారు ఆయకట్టుదారులు ఆశించిన విధంగా కాలువలో నీటి ప్రవాహం ఉండకపోవచ్చు. తాండవ కాలువలో ఇంతవరకు కోటి 22 లక్షల రూపాయలతో 19 చోట్ల పూడిక తీత పనులు చేశామని, ఇంకా నాతవరం గ్రామ సమీపంలో పనులు జరుగుతున్నాయని ఉపాధి హామీ పథకం ఏపీవో దాసరి కొండాజీ చెప్పారు.



నిత్యం గేట్లు లీకేజీ ద్వారా పోతున్న తాండవ నీరు

రూ.కోటి 50 లక్షలతో ఉపాధి నిధులతో పనులు

ఉపాధి హామీ పథకంలో తాండవ ప్రధాన కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టారు. కోటిన్నరతో చేసిన పనులు క్షేత్ర స్థాయిలో కన్పించలేదంటూ పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. తాండవ ప్రాజెక్టుకు సమీపంలోనే కాలువలో పూడిక దారుణంగా ఉంటే శివారు కాలువల పరిస్థితి ఏవిధంగా ఉంటుందోనని రైతులు అంటున్నారు.

ఆగని గేట్ల లీకేజీ

తాండవ ప్రాజెక్టు ప్రధాన గేట్ల లీకేజీ అరికట్టేందుకు రూ.11 లక్షలతో మరమ్మతులు చేపట్టారు. అయినా గేట్ల నుంచి లీకేజీ ఆగడం లేదు. నిత్యం నీరు బయటకు పోవడంతో ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

లీకేజీని అరికడతాం



తాండవ ప్రధాన గేట్లకు మరమ్మతు చేశాం. గేట్ల నుంచి కాకుండా బయట సిమెంటు దిమ్మ లోపల నుంచి లీకేజీ వచ్చేస్తుంది. ఆ లీకేజీకి కెమికల్‌తో పనులు చేయాలంటున్నారు. గేట్లు మరమ్మతులకు రూ.11 లక్షలు ఖర్చు చేశాం. ఎడమ కాలువలో పూడికతీత పనులు సరిగ్గా చేయలేదు.

– అనురాధ, తాండవ ప్రాజెక్టు డీఈ

అనుసంధానం కలేనా?

తాండవ.. జిల్లాలో అతి పెద్ద జలాశయం. వేలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్న వర ప్రదాయిని. ఖరీఫ్ కోసం నీరు విడుదల చేస్తున్న వేళ ఎన్నో సమస్యలు ఈ రిజర్వాయర్‌ను చుట్టుముట్టి ఉన్నాయి. కాలువలను ఎంత చక్కగా నిర్వహిస్తే అంత బాగా పొలాలకు నీరందుతుంది. కోట్లు ఖర్చు పెట్టినా పూడిక అలాగే ఉండడంతో శివారు ఆయకట్టుకు నీరందని దుస్థితి. ఇక తాండవ–ఏలేరు అనుసంధానం అమలు జరిగే పరిస్థితి కనిపించడం లేదు. కూటమి సర్కారు ఈ ప్రాజెక్టును పక్కన పెట్టేసింది. దానికి బదులుగా స్పీకర్ అయ్యన్న పోలవరం తాండవ ఎత్తిపోతల పథకం తెస్తానని చెప్పారు. ఏడాదైనా కదలిక లేదు.

నాతవరం: తాండవ రిజర్వాయర్–ఏలేరు కాలువ అనుసంధానాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసి ఎత్తిపోతల పథకం తెస్తామంటూ రైతులను మభ్యపెడుతోంది. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి తాండవ కాలువకు రూ.65 కోట్లతో సిమెంటు లైనింగ్ పనులు చేసి రైతులకు దన్నుగా నిలిచారు. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉభయ గోదావరి జిల్లాలను తలపించేలా చేసేందుకు తాండవ–ఏలేరు అనుసంధానం చేసేందుకు రూ.470.05 కోట్లు మంజూరు చేశారు. 2022 డిసెంబరులో నర్సీపట్నంలో శంకుస్థాపన చేశారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం ప్రాజెక్టు నుంచి అదనపు నీటిని కాలువ ద్వారా తరలించేందుకు అదనపు భూసేకరణ పనులను సైతం అధికారులు చేపట్టారు. భూ సేకరణ కోసం అప్పట్లో ప్రభుత్వం రూ.10 కోట్లు విడుదల చేసింది. పనులు ప్రారంభించే సమయంలో కాంట్రాక్టరు బిల్లులు రావంటూ జాప్యం చేశారు. అనుసంధానం పనులకు టీడీపీ నాయకుడికి చెందిన సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తాండవ–ఏలేరు అనుసంధానం పనులు 25 శాతం కూడా పూర్తి చేయలేదంటూ రద్దు చేసింది. వైఎస్సార్‌సీపీకి మంచి పేరు వస్తుందన్న అక్కసుతో ప్రాజెక్టు ఆపడం తగదని రెండు జిల్లాల్లోని రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమయింది. దీంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు పోలవరం కాలువ నుంచి తాండవ ఎత్తిపోతల పథకం తెస్తానంటూ హామీ ఇచ్చారు. ఏడాది గడుస్తున్నా పోలవరం తాండవ ఎత్తిపోతల పథకం ఊసెత్తలేదు. ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో రాష్ట్రంలో పలు ప్రాజెక్టులపై చర్చించి కొన్ని ప్రాంతాలకు కొత్తవి మంజూరు చేశారు. పోలవరం తాండవ ఎత్తిపోతల పథకం కనీసం చర్చకు రాకపోవడం గమనార్హం. దీనికి సంబంధించి ఎలాంటి ప్రతిపాదనలు లేవని తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ చెప్పారు.

ఆదివారం ఉదయం తాండవ రిజర్వాయరు నుంచి ఆయకట్టుకు గేట్లు ఎత్తి నీరు విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎత్తిపోతల పథకం గురించి స్పీకర్ ఏమి చెబుతారా అని రైతులు ఎదురుచూస్తున్నారు.



అనుసంధానం చేసే ఏలేరు కాలువ



తాండవ–ఏలేరు అనుసంధానం పనులకు 2022లో శంకుస్థాపన చేస్తున్న నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

స్పీకర్ హామీ ఎప్పుడు నెరవేరుస్తారు



స్పీకర్ అయ్యన్నపాత్రుడు పోలవరం తాండవ ఎత్తిపోతల పథకం గురించి బహిరంగ సభలో ఇచ్చిన హామీని ఎప్పుడు నెరవేరుస్తారో రైతులకు చెప్పాలి. మా హయాంలో మంజూరు చేసిన ఏలేరు–తాండవ అనుసంధానం పనులను రాజకీయ కక్షతో రద్దు చేశారు. అనుసంధానం పనులు సకాలంలో పూర్తయి ఉంటే రెండు జిల్లాల్లో వేలాది ఎకరాల ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు ప్రవహించేది. రైతులకు సాగునీటి కష్టాలు తీరేవి. కూటమి ప్రభుత్వం చేస్తున్న జిమ్మిక్కులు ప్రజలు గమనిస్తున్నారు.

–పెట్ల ఉమాశంకర్ గణేష్, మాజీ ఎమ్మెల్యే

న్యూస్‌రీల్

తాండవ సాగునీరు విడుదల నేడు

నాతవరం: మండలంలోని తాండవ జలాశయం నుంచి సాగునీటిని ఆదివారం విడుదల చేయనున్నట్టు తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ చెప్పారు. మధ్యాహ్నం 12.10 గంటలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి అనిత నీటిని విడుదల చేస్తారని తెలిపారు. 2025–26 ఖరీఫ్ సీజనుకు గాను సాగునీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో ఉన్న రైతులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

విశాఖ ఉక్కు సోలార్ ప్లాంట్ పునరుద్ధరణకు టెండర్లు



ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో గత మూడేళ్లుగా నిలిచిపోయిన 5 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌ను పునరుద్ధరించడానికి యాజమాన్యం టెండర్లు ఆహ్వానించింది. గతంలో ప్లాంట్ అంతర్గత అవసరాల కోసం ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ సాంకేతిక కారణాల వల్ల నిలిచిపోయింది. దీని పునరుద్ధరణ కోసం ఈ నెల 5న నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 18లోగా టెండర్లు దాఖలు చేయవచ్చు. టెండర్ దక్కించుకున్న సంస్థ ఆరు నెలల్లోగా పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది.

మేమూ గిరిజనులమే..

- సంక్షేమ పథకాలు అందించాలని మైదాన ప్రాంత అడవి బిడ్డల వినతి
- కోనాంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం
- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు
- థింసా నృత్యం చేసిన కలెక్టర్



థింసా నృత్యం చేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే బండారు

చీడికాడ: జిల్లాలోని 8 మండలాల్లో గిరిజనులు నివసిస్తున్నారని, వారికి ఏజెన్సీవాసుల వలె విద్య, వైద్యం తదితర రంగాల్లో సంక్షేమ పథకాలు అందజేయాలని పలు గిరిజన సంఘాల నేతలు కోరారు. కోనాంలో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కె.ఎస్.ఎన్.ఎస్. రాజు, సుందరపు విజయకుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పలు సంఘాలకు చెందిన గిరిజన నేతలు ఇరటా నర్సింహమూర్తి, ఎం.కొండలరావులు మాట్లాడుతూ మైదాన ప్రాంత గిరిజనులు ఎలాంటి ఆధారం లేక నిరుపేదలుగానే మిగిలిపోతున్నారని, 1/70 యాక్టును అమలు చేయాలని కోరారు. నాన్ షెడ్యూల్‌లో ఉన్న గిరిజన గ్రామాలను షెడ్యూల్‌లో కలిపి ఏజెన్సీ గిరిజనులకు అందుతున్న అన్ని చట్టాలు, సౌకర్యాలను మైదాన గిరిజన ప్రజలకు అందేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బండారు హామీ ఇచ్చారు. 1/70 యాక్టు మండలాలకు వర్తింప చేస్తే మిగిలిన గ్రామాల ప్రజలు, రైతులు ఇబ్బంది పడతారని, మండలం యూనిట్ గా కాకుండా గిరిజనులు ఉన్న పంచాయతీలకు వర్తింప చేసేలా కృషి చేస్తామన్నారు. గిరిజనులకు ప్రత్యేకించి పీజీఆర్ఎస్ కార్యక్రమం ఏర్పాటు చెయ్యాలని కోరగా నెలలో ఒకరోజు నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.



వివిధ తెగలకు చెందిన గిరిజనుల వేషధారణలో విద్యార్థులు

కోనాం నుంచి వాలాబుకు (దేవరాపల్లి) రోడ్డు వేయాలని కోరగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే రూ 2.15 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశామని, అనుమతులు రాగానే రోడ్డు పూర్తి చేస్తామన్నారు. జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు గిరిజన ఆచార వ్యవహారాలు, కట్టుబొట్టుతో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్ర మాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థినుల థింసా నృత్యంలో కలెక్టర్ విజయ కృష్ణన్, మాడుగుల ఎమ్మె ల్యే బండారు పాదం కలిపారు. ఈ సందర్భంగా డీ–వార్మింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, అధికారులకు మెమెంటో లు అందించారు. ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, వైస్ ఎంపీపీ కిముడు చిన్నమ్మలు, సర్పంచ్ సలుగు ఈశ్వరమ్మ, మండల ప్రత్యేకాధికారి మూర్తి, తహసీల్దార్ లింకన్, ఎంపీడీవో హేమసుందరరావు పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్‌ను ప్రభుత్వం ఆదుకోవాలి

- వచ్చే క్రషింగ్ సీజన్‌కు అవసరమైన గ్రాంటు ఇవ్వాలి
- రైతులు, కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలి
- ఫ్యాక్టరీ వద్ద ఆందోళనకు దిగిన చెరకు రైతులు
- 11న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాకు నిర్ణయం



ఫ్యాక్టరీ గేటు వద్ద ఆందోళన చేస్తున్న చెరకు రైతులు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మనుగడను కాపాడేందుకు నేరుగా సభ్య రైతులే ఆందోళనకు దిగారు. ఫ్యాక్టరీ కార్మికులు, ఏపీ రైతు సంఘాలు వారికి మద్దతుగా నిలిచారు. ఈ ఏడాది క్రషింగ్ జరుగుతుందో లేదో తెలియని పరిస్థితుల్లో ఉన్న సభ్యరైతులు ఆందోళన చెందుతూ తమ ఆవేదనను ప్రభుత్వానికి తెలియజేయాలని ఫ్యాక్టరీ వద్ద ధర్నా చేశారు. 2024–25 క్రషింగ్ సీజన్‌లో ప్రభుత్వం ఎటువంటి ఆర్థిక సాయం చేయకపోవడం వల్ల ఫ్యాక్టరీ పూర్తిగా ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. గతేడాదికి సంబంధించిన చెరకు బకాయిలు నేటికీ చెల్లించలేదు. అంతేకాకుండా ఈ ఏడాది క్రషింగ్ చేస్తారో లేదో తెలియని అగమ్యగోచరంగా ఉంది. దీనితో ఆందోళన చెందిన రైతులంతా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఆందోళన ఉధృతం అవుతుందని భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే రైతులు మాత్రం శాంతియుతంగానే తమ డిమాండ్లను తెలుపుతూ ఆందోళన చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి ఫ్యాక్టరీలో పరిపాలన భవనం వద్ద ధర్నా చేశారు. ప్రభుత్వం వెంటనే ఆర్థిక సాయం చేయాలని, ఈ ఏడాది క్రషింగ్ సీజన్ ప్రారంభించాలని, అందుకు కావలసిన ఫ్యాక్టరీ ఓవరాయిలింగ్ పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. 2025–26లో రానున్న క్రషింగ్ సీజన్‌కు వర్కింగ్ క్యాపిటల్ నిమిత్తం, ప్రస్తుతం రైతులకు, కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించడానికి అవసరమైన నిధులు ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీలకు అతీతంగా రైతులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు, వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఐ, సీపీఎం, సీఐటీయూ, ఏపీ రైతు సంఘం, ఏపీ చెరకు రైతు సంఘ నాయకులు పాల్గొని మద్దతు పలికారు.

కూటమి సర్కారు కపట నీతి

ఫ్యాక్టరీని కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులందరిపై ఉందని మాజీ సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, ఫ్యాక్టరీ మాజీ గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శరగడం రామునాయుడు, రాయి సూరిబాబు, మాజీ సర్పంచ్ పల్లేల వరహాలబాబు అన్నారు. ఎన్నికల ముందు ఫ్యాక్టరీని ఆదుకొని రైతులకు గిటుబాటు ధర కల్పిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఇప్పుడు ఎందుకు ఫ్యాక్టరీని ఆదుకోలేదని వారు ప్రశ్నించారు. చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు, అనకాపల్లి ఎంపీ ఎన్ని ముందు హామీ ఇచ్చి ఇప్పుడు ఎందుకు పట్టించుకోకుండా వదిలేశారని చెరకు రైతులంతా ముక్తకంఠంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేయాలని, ముందుగా ఈనెల 11వ తేదీన కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వాలని ఈ సందర్భంగా రైతులు నిర్ణయించారు. ప్రజా, రైతు సంఘాల నాయకులు శ్రీనివాసరావు, నందారపు భాస్కరరావు, ఎస్వీనాయుడు, ఏడువాక శ్రీనివాసరావు, జగదీష్, దండుపాటి తాతారావు,శరగడం అప్పారావు, పీలా రమణ, కొణతాల గణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక కార్యకర్తపై దాడికి నిరసన



సామాజిక కార్యకర్తపై హత్యాయత్నాన్ని ఖండిస్తూ నిరసన తెలుపుతున్న పలు సంఘాల నాయకులు

ఎస్.రాయవరం: ఎస్.రాయవరం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త నూకరాజుపై జరిగిన హత్యాయత్నం ఘటనను ఖండిస్తూ పలు సంఘాల నాయకులు ఎస్.రాయవరంలో నిరసన తెలిపారు. గోశాల అక్రమ నిర్వహణపై ఇచ్చిన ఫిర్యాదు మేర కు కక్షతో రౌడీ షీటర్ గొర్ల దేముడు, టీడీపీ నాయకుడు నమ్మింగి నానాజీ,టీడీపీ కార్యకర్త నానేపల్లి లక్ష్మణ్‌లు ఇంటికి వచ్చి హత్యాప్రయత్నం చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు నమోదైన కేసుల్లో తీవ్రత లేదని, ఇంటికి వచ్చి ముగ్గురు వ్యక్తులు పథకం ప్రకారం హత్యాయత్నానికి పాల్పడితే హత్యాయత్నం కేసులు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకుని జైలుకు తరలించాలని డిమాండ్ చేశారు. పట్టపగలు విచక్షణా రహితంగా దాడి చేసినా, మండల కేంద్రం, పోలీస్‌స్టేషన్‌కు అతి సమీపంలో పథకం ప్రకారం హత్యాప్రయత్నం చేస్తే, పోలీసులు నత్తనడకన స్పందిస్తూ, సాధారణ సెక్షన్లు రెండు వేసి చేతులు దులుపుకొన్నారని మండిపడ్డారు. నిందితులను వెంటనే అదుపులోనికి తీసుకుని హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో నూకరాజు ఇంటి వద్ద నుంచి ర్యాలీగా వచ్చి నిరసన తెలిపారు. వైఎస్సార్ విగ్రహం జంక్షన్‌కు చేరుకుని మానవహారం నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కి వెళ్లి సీఐ రామకృష్ణ, ఎస్ఐ విభీషణరావుకు వినతి పత్రం అందజేశారు. కాసేపు పోలీసులతో చర్చలు జరిపారు. జరిగిన సంఘటనపై పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని సీఐ రామకృష్ణ హామీ ఇచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సంఘటన కార్యదర్శి రామాల శివనాగేశ్వరరావు, ఆర్.ఎస్. .ఎస్ కార్యకర్త సిద్ధాబత్తుల చిట్టిబాబు, బీజేపీ నక్కపల్లి మండల అధ్యక్షుడు పొలాౖటి నానాజీ, ఆర్టీఐ కార్యకర్తలు పోలినాటి వీరబాబు, కోన బాబూరావు, కోడ బంగార్రాజు, గనగళ్ల రాము పాల్గొన్నారు.



నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని పోలీసులకు వినతి పత్రం ఇస్తున్న నిరసనకారులు

ఉత్సాహంగా పారా అథ్లెటిక్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: నగరంలోని పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్స్‌లో అంతర్ జిల్లాల పారా అథ్లెటిక్ పోటీలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో జూనియర్ (19 ఏళ్లలోపు), సబ్–జూనియర్ (17 ఏళ్లలోపు) ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే పి.వి.జి. ఆర్.నాయుడు ఈ పోటీలను ప్రారంభించి.. పాల్గొన్న అథ్లెట్లను అభినందించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు ట్రాక్, ఫీల్డ్ విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. టీ11–13 అంశాల పరుగు విభాగంలో ట్రాక్‌లో పరుగులందుకుని తగ్గేదేలే అంటూ పోటీపడ్డారు. ముఖ్యంగా వినికిడి లోపం ఉన్నవారు, మేధోపరమైన సవాళ్లు ఎదుర్కొంటున్న పిల్లలు కూడా ఈ పోటీల్లో చురుకుగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజయం సాధించిన అథ్లెట్లు హర్యానాలో ఈ నెల 22 నుంచి 24 వరకు జరిగే అంతర్ రాష్ట్ర పారా అథ్లెటిక్ మీట్‌కు రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు.

అప్పన్న ఆభరణాల తనిఖీలు ప్రారంభం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి చెందిన బంగారు, వెండి, ఇతర విలువైన వస్తువులు, ఆభరణాల తనిఖీలను దేవదాయశాఖ, రాజమహేంద్రవరం ఆర్‌జేసీ ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల కమిటీ శనివారం ప్రారంభించింది. ఈ తనిఖీలు మరో రెండు రోజులపాటు కొనసాగనున్నాయి. కడప జిల్లాకు చెందిన కె.ప్రభాకరాచారి గతేడాది ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ తనిఖీలు జరుగుతున్నాయి. రికార్డుల్లో పేర్కొన్న వివరాలకు, వాస్తవంగా ఉన్న ఆభరణాలకు తేడాలు ఉన్నాయని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై దేవదాయశాఖ జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజు ఈ ఏడాది జనవరి 17 నుంచి నెలరోజుల పాటు రికార్డులను పరిశీలించి నివేదిక సమర్పించారు. ఆ నివేదిక ఆధారంగా మరింత లోతుగా తనిఖీలు చేసేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన ఒక కమిటీని నియమించారు. ఆ తర్వాత ఆ విషయం మరుగున పడింది. ప్రస్తుతం రాజమండ్రి ఆర్‌జేసీగా కూడా విధులు నిర్వహిస్తున్న సింహాచలం ఇన్‌చార్జి ఈవో త్రినాథరావు చొరవతో ఈ తనిఖీలు మళ్లీ మొదలయ్యాయి. శనివారం ఉదయం 11 గంటలకు ఆలయానికి చేరుకున్న కమిటీ సభ్యులు.. తనిఖీలు ప్రారంభించారు.

క్లుప్తంగా

బిషప్ డేనియల్ 75వ వసంత వేడుకలు



బిషప్ డేనియల్ దంపతులను సన్మానిస్తున్న బిషప్ కె.ఆర్.సింగ్, బిషప్ డాక్టర్ జీవన్‌రాయ్

నర్సీపట్నం : యోరూషలేం ప్రార్థనామందిరం నిర్వాహకులు రెవ డా..అరసాడ డేనియల్ 75వ జన్మదిన వేడుకలను సంఘ సభ్యులు, కుటుంబ సభ్యులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వసంత వేడుకలను చర్చిలో నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఇమ్మానియల్ మినిస్ట్రీస్ బిషప్ డాక్టర్ జీవన్ రాయ్, యుసీఐఎం అధినేత బిషప్ కెఆర్.సింగ్ విచ్చేసారు. డేనియల్, అమ్మాణి దంపతులను ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించారు. డేనియల్ సేవలను వారు కొనియాడారు. ఈ వేడుకల్లో కృపా సిల్వన్, థామస్, నాహోర్, జాన్‌బాబు, కృపారావు, బెతస్థ నారాయణరావు, జి.రవి, శరత్, ఆశ, రాణి పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన పెంకుటిల్లు



కె.జె.పురంలో కూలిపోయిన పెంకుటిల్లు

మాడుగుల రూరల్ : ఇటీవల కురిసిన వర్షాలకు కె.జె.పురం గ్రామంలో పెంకుటిల్లు కూలిపోయింది. గ్రామంలో శాలిపేట వీధిలో నివసిస్తున్న కొట్యాడ కుమారి పెంకుటిల్లు శుక్రవారం అర్ధరాత్రి పైకప్పుతో సహా కూలిపోయింది. శుక్రవారం మధ్యాహ్నం, అర్ధరాత్రి కురిసిన వర్షాలకు పెంకుటిల్లు కూలిపోయింది. ఈ సమయంలో కుమారి ఇంట్లో లేకపోవడం వల్ల ప్రమాదం తప్పింది. నిరుపేదరాలు అయిన కుమారి తన కుటుంబాన్ని ఆదుకోవాలని తహసీల్దారు, తదితర అధికారులకు విజ్ఞప్తి చేసింది.

ముఖ్యమంత్రి చంద్రబాబు పాడేరు పర్యటనలో అలవి కాని ఆంక్షలు.. అడుగడుగునా అడ్డంకులు.. పోలీసుల ఓవరాక్షన్‌తో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గిరిజనుల సమస్యలు చెప్పేందుకు వచ్చిన పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులను సీఎంను కలిసేందుకు అవకాశం కల్పించకుండా అగౌరవ పరిచారు. ఎమ్మెల్యేతోపాటు పార్టీ శ్రేణులను పోలీసులు నెట్టేశారు. సీఎంను కలిసేందుకు ప్రయత్నించిన ఆదివాసీ జేఏసీ, గిరిజన ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు అవకాశం ఇవ్వలేదు. హెలిప్యాడ్ పరిసర ప్రాంతాల్లోని గిరిజనులకు నిర్బంధం విధించారు. కొంతమందిని ఇళ్లు ఖాళీచేయించగా.. మిగతా వారిని ఇళ్లల్లోంచి బయటకు రాకుండా ఇబ్బందులు పాల్జేశారు.

అడ్డంకులు.. నిర్బంధం.. అవమానం

సీఎం చంద్రబాబు పర్యటనలో అడుగడుగునా ఆంక్షలు

పోలీసుల ఓవరాక్షన్

- గిరిజనుల సమస్యలు చెప్పేందుకు ప్రయత్నించిన పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు అవమానం
- పోలీసులు నెట్టేయడంతో ఉద్రిక్తత
- పార్టీ శ్రేణులతో రోడ్డుపై బైఠాయించి ఎమ్మెల్యే నిరసన
- కూటమి ప్రభుత్వ చర్యలపై మండిపాటు
- ఆదివాసీ జేఏసీ ప్రతినిధులను అడ్డుకున్న బలగాలు

పాడేరు : ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఏజెన్సీలో ప్రధాన సమస్యలను తీసుకువెళ్లేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో ప్రయత్నించిన పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును పోలీసులు అడ్డగించి నెట్టేయడం విమర్శలకు దారి తీసింది. ఆహ్వానం మేరకు ఆదివాసీ దినోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించి అవమానపరిచారు. ఆదివాసీ ప్రాంతంలో సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఎంత చెప్పినా పోలీసులు వినలేదు. ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించిన ఆయనను అధిక సంఖ్యలో మోహరించిన పోలీసులు నెట్టేశారు. దీంతో వారి మధ్య చోటుచేసుకున్న వాగ్వాదం ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు, కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా పాడేరు సెయింటాన్స్ స్కూల్ జంక్షన్ ప్రధాన రహదారి వద్ద ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, పార్టీ శ్రేణులు సుమారు మూడు గంటల పాటు బైఠాయించారు. వారికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

కుంటుపడిన గిరిజనాభివృద్ధి

కూటమి ప్రభుత్వం హయాంలో గిరిజన ప్రాంత అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరకు ఎన్నికల సభకు వచ్చిన చంద్రబాబు అధికారంలోకి వస్తే జీవో నంబరు 3ను పునరుద్ధరిస్తామని, స్పెషల్ డీఎస్సీతో భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక పూర్తిగా విస్మరించారన్నారు. 1/70 చట్టానికి తూట్లు పొడుస్తూ.. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో చట్ట సవరణ కోసం మాట్లాడించి గిరిజనుల్లో భయాందోళనలకు గురి చేశారన్నారు. ఇంటింటికి రేషన్ వ్యవస్థ రద్దు చేయడంతో గిరిజనులు రేషన్ సరుకుల కోసం అష్టకష్టాలు పడుతున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో డోలీ మోతలు ఎక్కువై గిరిజనులు పడుతున్న బాధలు అన్నీఇన్నీ కావన్నారు. వీటితోపాటు స్థానికంగా ఉన్న గిరిజన ప్రాంత సమస్యలపై తాను సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందించేందుకు వెళ్తుంటే అడ్డుకోవడం సరికాదని ధ్వజమెత్తారు. ఆదివాసీ దినోత్సవంలో తాను హాజరై సమస్యలపై మాట్లాడితే గిరిజన ప్రాంతంపై కూటమి ప్రభుత్వం అసలు రంగు బయటపడుతుందనే ఉద్దేశపూర్వకంగా పోలీసులతో అడ్డుకుని అవమాన పరిచారన్నారు. తాను ఏమాత్రం వెనకడుగు వేసేది లేదని, గిరిజనులతో కలిసి మరింత ఉధృతంగా పోరాటాలు చేస్తామని ఎమ్మెల్యే హెచ్చరించారు.



కంపెనీల ప్రతినిధులతో ఒప్పందం చేసుకుంటున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో కలెక్టర్ దినేష్‌కుమార్

ఆదివాసీల సంక్షేమం పక్కనబెట్టి..

ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు తన ప్రసంగంలో ఆదివాసీలకు ఏ మాత్రం సంబంధం లేని ఎక్కడో జరిగిన ఘటనలు, హత్యా రాజకీయాలపై మాట్లాడటంతో అన్ని వర్గాల ప్రజలు విసుగు చెందారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, చట్టాలు, హక్కులు, వారికి అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన మాట్లాడకపోవడం విమర్శలకు తావిచ్చింది. ఆయన పర్యటన సందర్భంగా మండలంలోని లగిసపల్లి వద్ద అధికారులు హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. అక్కడకు సీఎం వచ్చి వెళ్లేంత వరకు ఆ ప్రాంతానికి కిలోమీటరు వరకు ఇళ్ల వద్ద ఎవ్వరూ ఉండకూడదని ముందుగానే హుకుం జారీ చేశారు. దీంతో కొంతమంది ఇళ్లు ఖాళీ చేయగా మిగతా వారు బయటకు రాకుండా ఇళ్లల్లోనే ఉండిపోయారు. హెలిప్యాడ్ నుంచి వంజంగి గ్రామం వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర అడుగడుగునా పోలీసులు మోహరించారు. దీంతో దారిపొడవునా నివాసం ఉన్న ఆదివాసీ కుటుంబాలు చంద్రబాబు వచ్చి వెళ్లేంత వరకు భయంభయంగా గడిపాయి. ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు తమకు అవకాశం ఇవ్వకుండా టీడీపీ నేతలకు అధిక ప్రాధాన్యమిచ్చి ప్రజావేదిక వద్దకు పోలీసులు అనుమతించారని ఆదివాసీలు పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.



పోలీసులు, ప్రభుత్వ తీరును నిరసిస్తూ పాడేరులో రోడ్డుపై బైఠాయించిన ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, పార్టీ శ్రేణులు



వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డుకునేందుకు భారీగా మోహరించిన పోలీసులు

ఎవరికోసం సీఎం పర్యటన?

ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర ఆవేదన

పాడేరు రూరల్: ముఖ్యమంత్రి చందబాబు పర్యటన ఎవరి కోసమని.. మరోసారి మోసపోవడానికి తాము సిద్ధంగా లేమని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర విమర్శించారు. చంద్రబాబుకు ఆదివాసీల సమస్యలు తెలియజేసేందుకు వెళ్తున్న ఆదివాసీ జేఏసీ, గిరిజన ఉద్యోగ సంఘాల నేతలను గొందూరు జంక్షన్ వద్ద పోలీసులు అడుకుని నిర్బంధించారు. ఈ సమయంలో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు, చట్టాలు, సమస్యలపై సీఎంను కలిసి వినతిపత్రం ఇవ్వాలనుకున్న తమను పోలీసులు దౌర్జన్యంగా అడ్డుకోవడం ప్రజాస్వామ్యబద్ధంగా విరుద్ధమన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలుచేయకపోవడంపై నిలదీస్తారన్న భయంతోనే పోలీసులతో ఆదివాసీల ప్రతినిధులను అడ్డుకుని కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించిందన్నారు. ఇంకా ఎన్నాళ్లు ఆదివాసీలను మోసం చేస్తారని.. మేము మోసపోవడానికి సిద్ధంగా లేమన్నారు, ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలకు ఆదివాసీ నాయకులను రానీయకుండా చేయడం అన్యాయమన్నారు. చంద్రబాబు పర్యటన వల్ల ఆదివాసీలకు ఒరిగిందేమి లేదన్నారు. సొంత పార్టీ నేతలకు కూడా కార్యక్రమానికి రాకుండా ఆంక్షలు విధించడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమన్నారు. భవిష్యత్తులో చంద్రబాబుకు ఆదివాసీల నుంచి తగిన గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రతినిధులు చిట్టపల్లి క్షనివాస్‌పడాల్ తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల్లో నిరుత్సాహం

సీఎం పర్యటన గిరిజన సంఘాలతో పాటు సొంత పార్టీ నేతలను నిరుత్సాహపరిచింది. ఆదివాసీ దినోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన చంద్రబాబుకు పలు సమస్యలు విన్నవించేందుకు వచ్చిన ఆదివాసీ విద్యార్థి, ఉద్యోగ, ప్రజాసంఘాలు, మహిళలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులకు అవకాశం లేకుండా పోయింది. సభా ప్రాంగణంలోకి సొంత పార్టీ నేతలను సైతం రానీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. అడుగడుగునా పోలీసుల ఆంక్షలతో ఇబ్బందులు పడ్డారు. చాలామంది నిరుత్సాహంతో వెనుదిరిగారు.



పాడేరు డీఎస్పీ షహబాజ్ అహ్మద్‌తో ఆదివాసీ జేసీ నేతల వాగ్వాదం

మహిళ ఆత్మహత్య

కోటవురట్ల: జమాదులపాలెం గ్రామంలో మహిళ శనివారం పురుగుమందు సేవించి ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్‌ఐ కె.మనోజ్‌కుమార్ తెలిపారు. పొలంలో భూమి వివాదంలో గొడవ పడిన నేపథ్యంలో మొల్లి శ్యామల(25) పురుగు మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నట్టు భావిస్తున్నారన్నారు. అయితే ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ఆమె మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు అన్న అప్పలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతురాలికి ఇద్దరు మగ పిల్లలున్నారన్నారు.

‘కృష్ణమూర్తిని బెదిరింపులకు గురిచేయలేదు’



సీఐ కోటేశ్వరరావు

బుచ్చెయ్యపేట : ఐయితంపూడి గ్రామానికి చెందిన ముచ్చకర్ల కృష్ణమూర్తిని పోలీసులు బెదిరించారని అతని తండ్రి మహాలక్ష్మినాయుడు చేస్తున్న ఆరోపణలో వాస్తవం లేదని కొత్తకోట సీఐ కోటేశ్వరరావు అన్నారు. శనివారం సాయంత్రం బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. గ్రామంలో జరిగిన దొంగతనం కేసులో అనుమానితులైన కృష్ణమూర్తితో పాటు ఇదే గ్రామానికి చెందిన ఐయితరెడ్డి శివకుమార్‌ను జూన్ 2వ తేదీన విచారించామన్నారు. విచారణలో ఇద్దరూ దొంగతనం చేసినట్టు, రెండు ఇళ్లల్లో దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించాన్నారు. దొంగతనం చేసినట్టు ఇద్దరూ వారి కుటుంబ సభ్యుల దగ్గర ఒప్పుకున్నారన్నారు. అదే రోజు నిందితులు ఇద్దరి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని, నిందితులకు వైద్య పరీక్షలు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినపుడు వారి ఒంటిపై ఎటువంటి గాయాలు లేవన్నారు. వారిని విచారణ పేరుతో కొట్టడం గాని తిట్టడం గాని చేయలేదన్నారు. కృష్ణమూర్తి తనకు ఉన్న వ్యక్తిగత కారణాల వల్ల ఈ నెల 4వ తేదీన విషం తాగగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. ఇదే విషయమై కృష్ణమూర్తికి అతని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పామన్నారు. దీనిపై ఇతరుల చెప్పిన విషయాలపై లేనిపోని ఆరోపణలు చేయరాదని కృష్ణమూర్తి కుటుంబ సభ్యులకు విన్నవిస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

పలు రైళ్లకు ఆయా స్టేషన్లలో హాల్ట్‌లు



తాటిచెట్లపాలెం: ఆయా ప్రాంతాల ప్రయాణికులు, ప్రజల అవసరాలకు తగినట్లుగా పలు రైళ్లకు ప్రయోగాత్మకంగా హాల్ట్‌లను ఇచ్చేందుకు రైల్వే బోర్డు నిర్ణయించినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం-కోర్బా-విశాఖపట్నం(18518/18517) ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 15వ తేదీ నుంచి ఇరువైపులా మురిబహల్ స్టేషన్లో హాల్ట్ కల్పించారు.
- ధన్‌బాద్-అలెప్పి-ధన్‌బాద్(13351/13352) బొకారో ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 15వ తేదీ నుంచి ఇరువైపులా అంబోడల, తెరుబలి స్టేసన్‌లో హాల్ట్ కల్పిస్తున్నారు.
- బిలాస్‌పూర్-తిరుపతి-బిలాస్‌పూర్(17481/17482) ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 15వ తేదీ నుంచి ఇరువైపులా అంబోడల, తెరుబలి స్టేషన్‌ల్లో హాల్ట్ కల్పిస్తున్నారు.
- హజరత్ నిజాముద్దీన్-విశాఖపట్నం(12808) సమతా ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 15వ తేదీ నుంచి, తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం-హజరత్ నిజాముద్దీన్(12807) సమతా ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 16వ తేదీ నుంచి తెరుబలి స్టేషన్‌లో హాల్ట్ కల్పిస్తున్నారు.
- అమృత్‌సర్-విశాఖపట్నం-అమృత్‌సర్(20808/20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 15వ తేదీ నుంచి ఇరువైపులా నరాజ్ మార్తాపూర్ స్టేషన్‌లో హాల్ట్ కల్పిస్తున్నారు.

ఉత్సాహంగా తెలంగాణ, ఆంధ్ర ఖోఖో పోటీలు



ఖో ఖో ఆడుతున్న జట్లు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అధినేత నరసింహారావు

పాయకరావుపేట : క్లస్టర్ - 7 సీబీఎస్‌ఈ పాఠశాలలకు నిర్వహిస్తున్న తెలంగాణ, ఆంధ్ర ఖో ఖో పోటీలు శ్రీప్రకాష్ విద్యా సంస్థల ప్రాంగణంలో శనివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. అండర్ -14,17,19 బాలురు, బాలికల విభాగంలో సుమారు 180 జట్లు 2000 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలు 3 రోజుల పాటు జరగనున్నాయి. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అధినేత నరసింహారావు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ, సీబీఎస్‌ఈ అబ్జర్వర్, ఖో ఖో ఫెడరేషన్ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా దేవీతల్లి ఆలయ పునః ప్రారంభోత్సవం



ఆలయ పునఃప్రారంభోత్సవంలో పాల్గొన్న శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

మునగపాక: మండలంలోని ఉమ్మలాడలోని దేవీతల్లి ఆలయ పునఃప్రారంభోత్సవంలో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాసనమండలి ప్రతిపక్ష నేత,మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ,ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్,మాజీ ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు,వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ పల్లె అప్పలనాయుడు,ఎంపీటీసీ మొల్లేటి కృష్ణవేణి, మొల్లేటి నారాయణరావు,శంకర్.కరోతి విజయకుమార్, ఆటో శ్రీను,నరసింగరావు,గణేష్, మొల్లేటి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.కాగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు.

వారియర్స్ జోరు.. లయన్స్ బేజారు

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) నాలుగో సీజన్‌లో తుంగభద్ర వారియర్స్ బోణీ కొట్టింది. వైఎస్సార్ రాజశేఖర రెడ్డి స్టేడియంలో శనివారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగిన మ్యాచ్‌లో సింహాద్రి వైజాగ్ లయన్స్‌పై 7 వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసింది. కెప్టెన్ మహీప్ కుమార్ (57) అర్ధశతకంతో జట్టును ముందుండి నడిపించారు. అంతకుముందు, టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన సింహాద్రి వైజాగ్ లయన్స్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి కేవలం 109 పరుగులు మాత్రమే చేయగలిగింది. జట్టు 48 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ రికీ భుయ్ (2) సహా బ్యాటర్లు పూర్తిగా విఫలమయ్యారు. సందీప్ (11), చివర్లో ధీరజ్ లక్ష్మణ్ (22) మాత్రమే రెండంకెల స్కోరును దాటగలిగారు. 110 పరుగుల లక్ష్య ఛేదనలో తుంగభద్ర వారియర్స్‌కు కూడా ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ శ్రీ సామాన్యు (3) త్వరగానే వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ మహీప్ కుమార్‌తో జతకట్టిన మరో ఓపెనర్ జ్ఞానేశ్వర్ (40) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. 12.2 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 114 పరుగులు చేసి విజయం సాధించింది.

క్లుప్తంగా

ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడం నిలిపివేత



మారేడుపూడి ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన రెవెన్యూ బోర్డు

సాక్షి ఎఫెక్ట్..

అనకాపల్లి: కూటమి అధికారంలోకి రాగానే మండలంలో పలు ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఇదే విషయమై ఈ నెల 6వ తేదీన హెచ్చరిక బోర్డులు తొలగించి భూ కబ్జా చేయడంపై సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో మండల రెవెన్యూ అధికారులు శనివారం స్పందించారు. ఈ మేరకు మారేడుపూడిలో సర్వే నంబర్ 390లో నాలుగు సెంట్ల గెడ్డపోరంబోకు భూమిలో గతంలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. దాన్ని తొలగించి దర్జాగా పిల్లర్లు వేసి చుట్టూ పునాదులు కట్టడంలో సంఘటనా స్థలానికి చేరుకున్న వీఆర్వో వాటిని నిలిపివేశారు. రెవెన్యూ బోర్డును ఏర్పాటు చేశారు. ఈ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేసినట్లయితే చట్టపరమైన చర్యలు చేపడతామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

అనకాపల్లిలో 1.8 మి.మీ వర్షపాతం



మారేడుపూడి రహదారిలో వర్షం

అనకాపల్లి: పట్టణ, మండలంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం శనివారం కురిసింది. మూడు రోజులుగా 35 నుంచి 37.0 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృత మై వర్షం పడటంతో వాతావరణం చల్లబడి ఉపశమనం పొందారు. ఈ మేరకు 1.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా విభాగం వాతావరణ శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

కశింకోట: శనివారం మధ్యాహ్నం కశింకోటలో గాలితోపాటు వర్షం కురిసింది. వాతావరణం చల్లబడింది. రెండు రోజుల క్రితం భారీ వర్షం కురిసింది. దీంతోపాటు ఇప్పుడు వర్షం కురవడంతో ఎండిపోతున్న వరి నారుమళ్లకు ఉపకరిస్తుందని రైతులు తెలిపారు.

తాగునీటి పైపులైన్ ఏర్పాటు



పైపులైన్, మోటారుబోరు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో అధికారులు తాగునీటి పైపులైన్ శనివారం ఏర్పాటు చేశారు. ఇక్కడ క్రీడాకారులు, వాకర్స్ పడుతున్న తాగునీటి ఇబ్బందులను జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పైపులైన్, మోటారు బోరు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయలేదు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 41 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,650	4,900
రెండో రకం	3,500	4,180
మూడో రకం	3,300	3,300

అనకాపల్లి సినిమాలు

రాజా	: సార్ మేడమ్ (మ్యాట్నీ, సెకండ్‌షో)
రాజా	: అతడు (ఫస్ట్ షో, మార్నింగ్ షో)
సత్యనారాయణ స్క్రీన్-1	: కింగ్‌డమ్
సత్యనారాయణ స్క్రీన్-2	: సోమేశ్వర సులోచన
పర్తిసాయి	: మహావతార్ నరసింహం
షిర్డీసాయి	: బకాసుర రెస్టారెంట్
వెంకటేశ్వర	: మాత్ళ
శ్రీ సత్య	: జూనియర్
రామచంద్ర	: హరిహర వీరమల్లు

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 383 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 311 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 68 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7, బీ పాజిటివ్-23, ఓ పాజిటివ్-34, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

- ప్రైవేటు భూమికి శ్మశాన వాటికలో అనధికార రోడ్డు
- అధికారులు అడ్డుకున్నా సిమెంట్ తూరలు ఏర్పాటు
- ప్రతిపక్షంలో ఒకలా.. అధికారంలో మరోలా కూటమి నేతల తీరు
- మళ్లీ ముంపు తప్పదని సత్తెమ్మపేట వాసుల ఆందోళన

అడ్డుకొని, అమ్ముడుపోయారు!



లోతట్టు ప్రాంతంలో సత్తెమ్మపేట గ్రామం



వర్షపు నీటిలో సత్తెమ్మపేట గ్రామం (ఫైల్)

తుమ్మపాల: ఓ ప్రైవేటు భూమికి వేస్తున్న అనధికార రోడ్డును ప్రతిపక్షంలో అడ్డుకుని.. అధికారంలోకి రాగానే ఎర్రతివాచీ పరిచిన కూటమి నాయకుల అవినీతికి అద్దం పట్టే ఘటన ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. మండలంలో శంకరం, బట్లపూడి, అనకాపల్లి నార్త్-2 రెవెన్యూ సరిహద్దులో జాతీయ రహదారికి ఆనుకున్న సత్తెమ్మపేట శ్మశానవాటికను కొంతమేర కప్పేసి ఆగమేఘాల మీద పదడుగుల ఎత్తున రోడ్డు వేస్తుండటతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనివల్ల లోతట్టు ప్రాంతమైన సత్తెమ్మతల్లి మరింత ముంపునకు గురవుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలోనూ అనకాపల్లి -ఆనందపురం జాతీయ రహదారి విస్తరణలో భాగంగా శ్మశాన వాటికను ఆనుకుని మూడు గ్రామాల సరిహద్దు (పొలిమేర)లో నిర్మించిన సత్తెమ్మతల్లి ఆలయం కోల్పోవడం, నష్టపరిహారంగా ప్రభుత్వం చెల్లించిన నిధులు కైంకర్యం చేశారు. ఆలయంలో విగ్రహాన్ని రోడ్డుపై పడేసి వదిలేసిన వివాదం నేటికి మాయనిమచ్చగా మిగిలిపోయింది. తాజాగా అక్రమార్కులు శ్మశానవాటిక మీదుగా సిమెంట్ బ్రిక్స్ పరిశ్రమ, ప్రైవేటు వ్యక్తుల భూములకు రోడ్డంటూ మరో వివాదానికి తెరలేపారు.

నాడు అడ్డుకుని.. ఇప్పుడు నిర్మించడంలో ఆంతర్యమేమిటీ?

జాతీయ రహదారి ఆనుకున్న శ్మశాన వాటికకు ఒక వైపు బట్లపూడి రెవెన్యూ పరిధిలో ఓ ప్రైవేటు వ్యక్తికి నాలుగెకరాల భూమితోపాటు సిమెంట్ బ్రిక్స్ పరిశ్రమ ఉంది. గతంలో జాతీయ రహదారి నుంచి వంద మీటర్ల దూరంలో ఉండే సదరు వ్యక్తి ల్యాండ్‌కు కొన్నాళ్ల క్రితం హైవే ఆరు లైన్ల అభివృద్ధితో 15 మీటర్ల దూరంలోనే సర్వీస్ రోడ్డు ఏర్పడింది. దీంతో శ్మశాన వాటికను కొంత భాగం మట్టితో కప్పి పదడుగుల ఎత్తున రోడ్డు వేసేందుకు సిద్ధపడగా, ఏడాదిన్నర క్రితం సత్తెమ్మపేటకు చెందిన కొందరు వ్యక్తులు అడ్డుకున్నారు. ఇక్కడ రోడ్డు వేస్తే వరదలు, తుపాన్లు వచ్చినప్పుడు గ్రామంలో నీరంతా సమీప పులికాలువకు చేరదని ఫిర్యాదులు చేయడంతో అధికారులు స్పందించి ఆ రోడ్డు పనులను నిలిపివేశారు. అప్పటి నుంచి ప్రశాంతంగా ఉన్న రోడ్డు వివాదం ఇటీవల కూటమి నాయకుల కాసుల



సత్తెమ్మపేట శ్మశానవాటిలో ఏర్పాటు చేస్తున్న 20 అడుగుల అనధికార రోడ్డు

కక్కుర్తితో మళ్లీ మొదలైంది. గతంలో అడ్డుకున్న వీరే ఇప్పుడు రోడ్డు వేసేందుకు పూనుకున్నారు. ఈ నెల 7న శ్మశానంలో సిమెంట్ తూరలు(పైపులు) అమర్చి పదడుగుల ఎత్తున జాతీయ రహదారికి సమాంతరంగా రోడ్డు పనులు మొదలుపెట్టారు. దీనిపై గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలకు సమాచారం ఇవ్వడంతో వారు అడ్డుకునే ప్రయత్నం చేసినా అక్రమార్కులు ఆగలేదు. ఆగమేఘాల మీద జేసీబీతో శ్మశాన వాటిక నుంచి 20 అడుగుల వెడల్పు మేర రోడ్డు పనులు ప్రారంభించారు. గ్రామంలో వర్షపు నీరు పోయేందుకు రెండు తూరలు వేసి సరిపెట్టేశారు. మరో రెండు మూడు రోజుల్లో పనులు పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వర్షం కురిస్తే సత్తెమ్మపేటకు ముంపు...

శంకరం వైపు ఏలేరు కాలువ, అనకాపల్లి పట్టణం వైపు పులికాలువ మధ్యలో లోతట్టు ప్రాంతమైన సత్తెమ్మపేట గ్రామం ఉంది. ఇక్కడ చిన్నపాటి వర్షం కురిసినా 30పైగా గృహాల ముందు మోకాల్లోతు వర్షపునీరు నిలిచిపోతోంది. పదడుగల ఎత్తున జాతీయ రహదారి నిర్మించడంతో శ్మశానవాటిక మీదుగా పులికాలువలోకి పారాల్సిన నీరు గ్రామం మరింత లోతుగా ఉండటంతో నిలిచిపోయి ముంపు సమస్య తప్పడం లేదు. ఈ ముంపు వల్ల ఐదేళ్లలో అనేక సార్లు రెవెన్యూ అధికారులు మోటార్లు పెట్టి నీటిని బయటకు తోడిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికే లోతట్టు గ్రామానికి మరో శాపంలా కూటమి నాయకులు తయారయ్యారని, బట్లపూడిలో ప్రైవేటు భూములు, పరిశ్రమలకు లబ్ధి చేకూరేలా వ్యవహరిస్తున్నారని, లక్షల్లో ముడుపులు వసూలు చేసుకుని గ్రామాన్ని శాశ్వత ముంపునకు గురిచేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అడ్డుకున్న వ్యక్తులే డబ్బుకు అమ్ముడుపోయారని వాపోతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాల్సిందే..



చిన్నపాటి వర్షానికి సత్తెమ్మపేటలో గృహాల్లో నీరు చేరుతోంది. కలెక్టర్ ఆదేశాలతో ఎన్ఆర్ఈజీఎస్, మండల పరిషత్, గ్రామ పంచాయతీ నిధులు రూ.10 లక్షల వరకు ఖర్చు చేసి కల్వర్టుతోపాటు సీసీ రోడ్డు ఏర్పాటు చేశాం. కొందరు వ్యక్తులు అమ్ముడుపోయి శ్మశానవాటికలో కొంత భాగాన్ని మరింత ఎత్తు చేసి ప్రైవేటు భూములు, సిమెంట్ బ్రిక్స్ పరిశ్రమకు రోడ్డు ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారు. అధికారులు గ్రామ స్థితిగతులను పరిశీలించి శ్మశానవాటికలో అనధికార రోడ్డు పనులను అడ్డుకోవాలి. వేసిన రెండడుగుల సిమెంట్ తూరలను తొలగించాలి.

– వసుపులేటి లక్ష్మి, సర్పంచ్, శంకరం గ్రామ పంచాయతీ

గౌరీ గ్రంథాలయ సర్వసభ్య సమావేశం నేడు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయం సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక కొణతాల సుబ్రహ్మణ్యం కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు గౌరీ గ్రంథాలయం అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రంథాలయ ప్రగతి నివేదిక, నూతన కార్యవర్గం ఎన్నిక జరుగుతుందన్నారు. సమావేశానికి సభ్యులు అందరూ హాజరు కావాలని, వివరాలకు 92471 66511ను సంప్రదించాలని కోరారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఉత్సవ కమిటీ

అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్రలోనే పేరుగాంచిన వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయ ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం అట్టహాసంగా జరిగింది. ఇక్కడ ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గరికి వెంకట్రావు, కార్యదర్శి నానేపల్లి రవి, కోశాధికారి పోతల రమణ, ఉపాధ్యక్షులు పెదిరెడ్ల నాగు, నరిశెట్టి శ్రీను, సహాయ కార్యదర్శులు వేముల పాపయ్యశెట్టి, పద్మనాభుని శంకర్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం సీతారామ కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ఆలయ ప్రతిష్ట దిన దినాభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీధి పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

అనకాపల్లి టౌన్: వివాహిత అదృశ్యంపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్ఐ భాస్కరరావు వివరాల ప్రకారం.. పట్టణంలోని ఉప్పలవారి వీధికి చెందిన డేగ్గంపూడి సరోజిని (45) ఈ నెల 6న తన ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాకపోవడంతో శనివారం ఆమె సోదరుడు వెంకటేశ్వరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పెరుగుబజార్ రోడ్డు విస్తరణ ప్రారంభం



రోడ్డు విస్తరణ పనుల ప్రారంభ కార్యక్రమంలో కూటమి నాయకులు

అనకాపల్లి టౌన్: సుమారు ఏడాదిన్నర తర్వాత పట్టణంలోని పెరుగుబజార్ జంక్షన్ నుంచి గాంధీ బొమ్మ జంక్షన్ వరకు రోడ్డు పనులు ఎట్టకేలకు పునః ప్రారంభమయ్యాయి. ఈ రోడ్డు విస్తరణపై వైఎస్సార్‌సీపీ, ప్రజా సంఘాల పోరాటాలతోపాటు పలుమార్లు పత్రికలలో కథనాలు రావడంతో కూటమి నాయకుల్లో కదలిక వచ్చింది. శనివారం పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఎంతో రద్దీగా ఉండే ఈ రహదారి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విస్తరణ చేపట్టారు. తదనంతరం ఎన్నికలు రావడంతో విస్తరణ పనులకు బ్రేక్ పడింది. రోడ్డు విస్తరణలో భవనాలు కోల్పోయిన 94 మందికి టీడీఆర్‌లు ఇవ్వగా, మిగిలిన 40 మందికి ఇంకా ఇవ్వలేదు. దీంతో విస్తరణ పనులు ఆలస్యమయ్యాయి. తాజాగా రహదారి పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో 84వ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి, నీలబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

హైవేపై వర్షపునీటితో ప్రమాదాలు



జాతీయ రహదారిపై ప్రమాదకరంగా నిలిచిపోయిన వర్షపు నీరు



రోడ్డుపై నీటిలో జారిపడిన ద్విచక్ర వాహనదారులు

తుమ్మపాల: మండలంలో శంకరం బొజ్జన్నకొండ జంక్షన్ వద్ద అనకాపల్లి – ఆనందపురం జాతీయ రహదారిపై వర్షపు నీటి ప్రవాహంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి రోడ్డుపై ఇరువైపులా వర్షపునీరు ఏరులై పారింది. సబ్బవరం నుంచి అనకాపల్లి వైపు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు నీటిలో అదుపు తప్పి గాయాల పాలయ్యారు. క్షతగాత్రులైన వృద్ధ దంపతులను వెనుక నుంచి వస్తున్న మరో వాహనంలో ప్రయాణికులు ఆస్పత్రికి తరలించారు. జాతీయ రహదారి విస్తరణలో శంకరం పరిసర ప్రాంతాల్లో వర్షపు నీటి ప్రవాహానికి సరైన కల్వర్టులు ఏర్పాటు చేయలేదు. దీంతోపాటు కాలువలు ఆక్రమణకు గురికావడంతో నీరంతా రోడ్డుపై నిలిచిపోతోంది. దాంతో అనేక ప్రమాదాలు ఇక్కడ చోటు చేసుకోవడంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని, ప్రమాదాల నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

వేడుకగా రక్షా బంధన్



అక్కిరెడ్డిపాలెం ఎన్టీఆర్ కాలనీలో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క

అనకాపల్లి/కశింకోట: సోదరసోదరీమణుల ప్రేమకు ప్రతిరూపంగా నిలిచే రక్షాబంధన్ పండగను శనివారం ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. అన్నా.. నీ అనురాగం ఎన్నో జన్మల పుణ్యఫలం అంటూ అక్కాచెల్లెళ్లు సోదరులకు రాఖీకట్టి జీవితాంతం కష్టసుఖాల్లో తోడుంటామంటూ తమ ప్రేమాభిమానాన్ని చాటుకున్నారు. అన్నాచెల్లెళ్ల పండగయిన రాఖీ సంబరాలు వాడవాడలా ఘనంగా జరిగాయి. దూరప్రాంతాల్లో అక్కాచెల్లెళ్లు పుట్టింటికి వచ్చి తోబుట్టువులకు రాఖీలు కట్టి అభిమానాన్ని చాటుకున్నారు. బ్రహ్మకుమారీ సభ్యులు పలు రాజకీయ నేతలు గృహాలకు వెళ్లి రక్షలు కట్టారు.

జాజిగెడ్డ ఆక్రమణల పరిశీలన



రిజర్వాయర్ ఆక్రమణలు పరిశీలిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

మాకవరపాలెం : జాజిగెడ్డ రిజర్వాయర్ ఆక్రమణలను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. మండలంలోని పాపయ్యపాలెంలో ఉన్న జాజిగెడ్డ రిజర్వాయర్ ఆక్రమణలకు గురైందని రైతులు ఇటీవల తహసీల్దార్ వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణల కారణంగా రిజర్వాయర్ గర్భం కుదించుకుపోతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శనివారం తహసీల్దార్‌తో పాటు ఇరిగేషన్ అధికారులు ఈ రిజర్వాయర్ ఆక్రమణలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రికార్డుల ప్రకారం రిజర్వాయర్ గర్భాన్ని పూర్తిస్థాయిలో సర్వే చేసి ఆక్రమణలు తొలగిస్తామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

వైభవంగా కామాక్షిదేవి, ఏకాంబరేశ్వరుడి కల్యాణం



కామాక్షిదేవి, ఏకాంబరేశ్వరుడి కల్యాణంలో భక్తులు



కామాక్షిదేవి ఆలయంలో పలువురు దంపతులతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

అనకాపల్లి: శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని శనివారం స్థానిక గవరపాలెం, నిదానందొడ్డి కామాక్షిదేవి ఆలయం మండపంలో కామాక్షిదేవి, ఏకాంబరేశ్వరుడి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణంలో విశ్వబ్రాహ్మణ పట్టణ సంఘం అధ్యక్షుడు పొన్నాడ వెంకట సత్య నరసింహచారి (పెదబాబు), వెంకటరత్నం వేణు దంపతులు పాల్గొన్నారు. అనంతరం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆలయ ఆవరణలో పలువురు దంపతులతో చేయించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ పట్టణ సంఘం ప్రధాన కార్యదర్శి ఎండపల్లి మోహన్ బ్రహ్మాజీ, కోశాధికారి కిలాడ శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



కశింకోటలోని ధ్యాన వేంకటేశ్వరస్వామి అలంకరణ



గవరపేటలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి అర్చకుడు శ్రీనివాస్ పూజలు

కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి జన్మించిన శ్రావణ నక్షత్రం పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి వజ్ర కవచాలంకృతులతోపాటు వివిధ రకాల పూలు, తులసీ మాలలతో అందంగా అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. నక్షత్ర హారతి ఇచ్చారు. ప్రసాద వితరణ చేశారు. అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు ఎక్కువ సంఖ్యలో దర్శించారు. స్థానిక గవరపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాస్ పూజా కార్యక్రమాలు జరిపారు.

గిరిజనుల హక్కుల కోసం ఆందోళన



గిరిజనులు హక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ ఎస్టీ

నాతవరం : రాజ్యాంగంలో గిరిజనులకు కల్పించిన హక్కులను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బండి గంగరాజు అన్నారు, ఆయన శనివారం ప్రపంచ ఆదివాసీల దినోత్సవం సందర్భంగా సరుగుడు పంచాయతీ శివారు రామన్నపాలెం గ్రామంలో గిరిజన సంక్షేమ హైస్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదాన ప్రాంతంలో నివాసం ఉంటున్న గిరిజనులకు అన్ని విధాలుగా అన్యాయం జరుగుతుందన్నారు. పాడేరు ఐటీడీఏ ద్వారా అనేక సంక్షేమ పథకాలు మైదాన ప్రాంత గిరిజనులకు అందించేవారన్నారు. 1/70 యాక్టు పరిధిలో గిరిజనులు నిబంధనల ప్రకారం ఎలాంటి పనులు జరగడం లేదన్నారు. ఆదివాసీల దినోత్సవాలు చేయడం తప్ప చంద్రబాబు ప్రభుత్వంలో గిరిజనులకు ఎలాంటి మేలు జరగదన్నారు. మైదాన ప్రాంత గిరిజనులకు ఐటీడీఏ పరిధిలో వారికి అందించే ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటు చేయాలి

నర్సీపట్నం : గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటు చేయాలని ఆదివాసి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ధనార్జున్, ధర్మరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసి దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని అబిడ్‌సెంటర్‌లో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గిరిజనుల న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఏజెన్సీ ముఖద్వారమైన నర్సీపట్నంలో గిరిజన భవనం నిర్మాణానికి స్థలాన్ని మంజూరు చేయాలని కోరారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

108 కలశాలతో ఊరేగింపు

కోటవురట్ల: స్థానిక వరాహనది తీరాన వేంచేసిన గణపతి ప్రయుక్త కనకదుర్గమ్మ ఆలయంలో వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గ్రామ శాంతిని కోరుతూ హోమం చేశారు. ప్రత్యేక పూజలు, అష్టోత్తర కలశాభిషేకం చేశారు. అనంతరం 108 కలశాలతో శాకాంబరి అవతారంలో అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

కుండపోత వర్షంతో హర్షం



చెరువును తలపిస్తున్న కోటవురట్ల మెయిన్‌రోడ్డు

కోటవురట్ల: మండలంలో శనివారం కుండపోత వర్షం కురిసింది. తెల్లవారు జామున సుమారు రెండు గంటల పాటు దంచి కొట్టగా మళ్లీ సాయంత్రం మరోసారి ఎడాపెడా కురిసింది. రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తుపాకుల గెడ్డలోకి చాలా కాలానికి జలకళ చేరింది. ఎప్పటిలానే మండల పరిషత్ కార్యాలయం ఎదుట భారీగా వర్షం నీరు నిలిచిపోయి చెరువును తలపించింది. రోడ్డు నిండిపోవడంతో పాటు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోకి ప్రవహించింది. వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. పాదచారులు నడిచే దారిలేక అవస్థలు పడ్డారు. మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. చాలా కాలంగా ఇక్కడ సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండలవాసులు మండిపడుతున్నారు. కనీసం ప్రజా ప్రతినిధులు కూడా దృష్టి సారించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భజన చెట్టు ఊరేగింపు



కొత్త భజన చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

యలమంచిలి రూరల్: మండలంలోని ఏటికొప్పాకలో శనివారం భజన చెట్టు ఊరేగింపు కార్యక్రమం శనివారం వైభవంగా జరిగింది. ఇక్కడ నదీవీధి రామాలయానికి గొంతుముర్తి నూకరాజు దంపతులు కొత్త భజన చెట్టును బహూకరించారు. దీనికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన తర్వాత గ్రామంలో ఊరేగించారు. అనంతరం రామాలయం వద్ద అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో యలమంచిలి జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సేనాపతి రాము, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఉద్దండం త్రినాథరావు(యూటీఆర్), వార్డు సభ్యులు సెనంశెట్టి నాయుడు, రావి చలపతి, దేవరాపల్లి రమణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.